ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 27 జూన్ 2025

ఉష్ణోగ్రత (అంచనా)

27-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	36	26
తెనాలి	36	27
నరసరావుపేట	36	26
బాపట్ల	36	27
రెంటచింతల	35	27
చీరాల	36	28


మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న సీఎం చంద్రబాబు



సభలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

ప్రజా చైతన్యంతోనే.. డ్రగ్స్ కట్టడి

- శాటిలైట్, డ్రోన్ల నిఘాతో గంజాయి నియంత్రణ
- ముఠా కక్షలను అణచివేసినట్లుగా మాదకద్రవ్యాలపై దృష్టి
- మాదక ద్రవ్యాల దుర్వినియోగం... అక్రమ రవాణా దినోత్సవ సభలో సీఎం చంద్రబాబు
- ప్రజాప్రతినిధులు, విద్యార్థులతో కలసి గుంటూరులో వాక్‌థాన్


మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో పాల్గొన్న ప్రజానీకం

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్యంతోనే డ్రగ్స్, గంజాయి కట్టడి చేయగలమని ముఖ్యమంత్రి చంద్ర బాబు తెలిపారు. అంతర్జాతీయ మాదకద్ర వ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులోని శ్రీ కన్వెన్షన్‌లో గురువారం జరిగిన అవగాహన సభలో సీఎం ప్రసంగించారు. గతంలో ఉమ్మడి, ఆ తర్వాత విభజన ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని, అయితే ఈసారి యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ గంజాయి అత్యంత ప్రమాదకరంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి, డ్రగ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. గూగుల్, శాటిలైట్, డ్రోన్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గంజాయి సాగును పూర్తిగా తుడిచి వేశామన్నారు. గతంలో రౌడీయిజం, ముఠా కక్షలు, మత విద్వేషాలను పూర్తిగా అరికట్టామన్నారు. గత వైసీపీ పాలకులు గంజాయి సాగులో దేశంలోనే ఏపీని నెంబర్ వన్ స్థానంలో నిలపగా తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గంజాయి, డ్రగ్స్ నివారణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో అత్యంత ప్రమాదకరమైన డ్రగ్స్, గంజాయి కట్టడి చేయాలంటూ తాము పోరాడితే జగన్ ఒక్కరోజు కూడా స్పందించలేదన్నారు. గంజాయి పండించే వ్యక్తులు, అక్రమ రవాణా చేసేవారు, వాటికి బానిసలైన అందరిపైనా యుద్ధం ప్రకటిస్తున్నానన్నారు. అటువంటి వారు ఇకనైనా మారాలని, లేదంటే రాష్ట్రం వదిలి (మిగతా 8లో)


ఎన్‌సీసీ క్యాడెట్లు విద్యార్థులతో ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు


జ్యోతి వెలిగించి సభను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, హోం మంత్రి అనిత, చిత్రంలో సీఎం చంద్రబాబు, మంత్రి సంధ్యారాణి

బంగారం రికవరీలో...

బ్యాంకు నిర్లక్ష్యం

దొడ్లేరు సీజీజీబీ ఎదుట బాధిత రైతుల దీక్ష

క్రోసూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరులో రెండేళ్ల క్రితం గోల్డ్ అప్రైజర్ నాగార్జున చేతివాటం కారణంగా మాయమైన రూ2 కోట్ల బంగారాన్ని ఇప్పించడంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల నిరసన దీక్షను గురువారం రైతులు బ్యాంకు ఎదుట ప్రారంభించారు. బంగారం మాయంపై ఆందోళనలు నిర్వహించినా అధి కారులు, పోలీసులు హామీలు ఇస్తున్నారే తప్ప సమస్య పరిష్కరించడంలేదని రైతులు వాపోయారు. మొత్తం 520 మంది రైతులకు సంబంధించిన బంగారం మాయం కాగా ఇప్పటికి 390 మందికి ఇచ్చారని మిగిలిన 130 మంది రైతుల గుర్తించి పట్టించుకోవడం లేదన్నారు. తమ బంగారం మాయం కావడానికి కారణమైన నిందితుడు నాగార్జునను అరెస్టు చేశారో లేదో కూడా తెలియడం లేదన్నారు. వెంటనే తమ బంగారాన్ని ఇప్పించక పోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. రైతుల ఆందోళనకు కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు తమ్మిశెట్టి హనుమంతరావు మద్దతు ప్రకటించారు. దీక్షలో షేక్ రహూఫ్, ఈశ్వరరెడ్డి, శిలార్, హుస్సేన్‌బీ, వెంకాయమ్మ, జానీబాషా, రాంబాబు, ఫాతిమా, వరలక్ష్మి పాల్గొన్నారు.


దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

డ్రగ్స్ వద్దు.. బ్రో

- నరసరావుపేటలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రదర్శన
- కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యేతో పాటు పెద్దసంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు



ప్రదర్శనలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వద్దు బ్రో.. అంటూ ప్లకార్డులతో నరసరావుపేటలో విద్యార్థులు, అధికారులు సంయుక్తంగా ప్రదర్శన చేపట్టారు. గురువారం మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో గాంధీ పార్కు నుంచి పోలీసు కవాతు మైదానం వరకు ప్రదర్శన సాగింది. డ్రగ్స్, గంజాయికి యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. ఎక్కడైనా వీటిని విక్రయిస్తుంటే వాటి సమాచారాన్ని పోలీసులకు ఇవ్వాలని తెలిపారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసులు, ప్రజల సమష్టి భాగస్వామ్యంతోనే మాదకద్రవ్యాల నివారణ సాధ్యమవుతుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ గంజాయి నిరోధానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదన్నారు. ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేసి మాదక ద్రవ్యాలపై నిఘా ఉంచినట్లు చెప్పారు. ప్రదర్శనలో వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, డీఆర్వో మురళి, ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

- ఊపందుకోనున్న భవన నిర్మాణాలు
- క్రిమినల్ కేసుల నుంచి ఎల్‌టీపీలకు మినహాయింపు
- సెట్ బ్యాక్ స్థలం తగ్గింపు.. నిర్మాణదారులకు ఊరట
- భవనాల ప్లాన్‌లు దాఖలు చేస్తున్న లైసెన్స్‌డ్ ఇంజనీర్లు



నిబంధనలు సడలింపు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పట్టణ భవన నిర్మాణాల్లో కొత్త నిబంధనలను ప్రభుత్వం సడలించింది. ట్రాఫిక్, డ్రెయినేజీ సమస్యలు తీర్చే దిశగా ప్రభుత్వం నిర్మాణాలకు కొత్త నిబంధనలు విధించిన విషయం తెలిసిందే. ఇవి నిర్మాణ రంగానికి గుదిబండగా మారడంతో ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో నిబంధనలను సమీక్షించి కొన్నింటిని సవరిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రధానంగా భవన నిర్మాణంలో వదలాల్సిన స్థలానికి (సెట్ బ్యాక్) మినహాయింపు ఇచ్చింది. భవన నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ టౌన్ ప్లానర్స్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసే విధానాన్ని విరమించుకుంది. కొత్త నిబంధనలతో భవన నిర్మాణాలకు ప్లాన్ దరఖాస్తులు కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. నిబంధనలు సడలింపు చేయడంతో ప్లాన్‌ల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. దీంతో తిరిగి భవన నిర్మాణాలు ఊపందుకునే పరిస్థితులు నెలకొనున్నాయి.

నిలిచిన నిర్మాణాలు

కొత్త నిర్మాణాలకు ప్లాన్ ఆన్‌లైన్‌లో దాఖలు చేసేందుకు లైసెన్స్ టౌన్ ప్లానర్స్ (ఎల్‌టీపీ)కు పూర్తి అధికారాలను ప్రభుత్వం ఇచ్చింది. ప్లాన్‌ను అతిక్రమించి భవనం నిర్మిస్తే అందుకు ఎల్‌టీపీలను బాధ్యులను చేసింది. దీంతో యజమానులు ప్లాన్‌లు మంజూరు కాక కొత్త ఇళ్ల నిర్మాణాలు (మిగతా 8లో)

ఆడుదాం ఆంధ్రా.. అవినీతిమయం

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో కోట్లలో అక్రమాలు
- ఇప్పటికే 28 మండలాల్లో విజిలెన్స్ విచారణ పూర్తి
- 10 రోజుల్లో విచారణ కొలిక్కి.. ప్రభుత్వానికి నివేదిక?
- భోజనాల్లో రూ.50 లక్షలు హాంఫట్.. క్రికెట్ కిట్లు మాయం


సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

గుంటూరు సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆడుదాం.. ఆంధ్రా అంటూ రూ.కోట్లు కొట్టేశారు. ఆటలకు ప్రాధాన్యం అంటూ ప్రభుత్వ సొమ్ములను బొక్కేశారు. ఆడుదాం ఆంధ్రాపై అప్పట్లోనే అనేక ఆరోపణలు రాగా కూటమి ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో ఆడుదాం ఆంధ్రాలో చోటుచేసుకున్న అవినీతి వ్యవహారాలు వెలుగుచూస్తున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వేదికగా రూ.కోట్లలో అక్రమాలు జరిగినట్లు తేలింది. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన ఆడుదాం ఆంధ్రాలో నేతలు, అధికారులు అందిన కాడికి దండుకున్నారన్న ఆరోపణలు విజిలెన్స్ విచారణలో వెలుగుచూస్తున్నాయి. కాగా ఇప్పటికే 28 మండలాల్లో (మిగతా 8లో)


అప్పట్లో పంపిణీ చేసిన నాసిరకం క్రికెట్ బ్యాట్‌లను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 19.91 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందన్నారు.

43,848 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 44,633 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 43,848 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,563 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11000
334	9500	13000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13300	334	9500	13000
273	----	-----	నెంబరు. 5	10000	13400
341	10000	13200	273	----	----
4884	---	--	341	10000	13500
సూపర్ 10	---	--	సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	13500	తేజ	10000	13600
షార్క్-1	---	---	బ్యాడిగి	10000	13000
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	---	---
దేవనూరు డీలక్స్	10000	12800	తాలుకాయలు	4500	7000

మత్తులో ముంచేస్తున్నారు..!

మెథలీన్ డైయాక్సీ ఎన్ మెథాఫెటమైన్ (ఎండీఎంఏ).. విద్యా నిలయాల్లోకి చేరిందా? ఇంజనీరింగ్, ఇతర కళాశాలల్లో విద్యార్థులు ఈ డ్రగ్‌ను వాడుతున్నారా? తల్లిదండ్రులు ఇచ్చిన డబ్బును దీనికోసం వెచ్చిస్తున్నారా? అంటే అవుననే సమాధానమే వస్తుంది. ఢిల్లీ-విజయవాడ ఎండీఎంఏ డ్రగ్ కేసులో తవ్వేకొద్దీ కొత్త విషయాలు బయటకొస్తుండగా, తాజాగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లోని ప్రముఖ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల పేర్లు పోలీసుల చేతికి చిక్కాయి.

- విద్యార్థులే టార్గెట్‌గా నగరానికి డ్రగ్స్ సరఫరా
- ఎండీఎంఏ కేసులో బయటపడుతున్న నిజాలు
- ఇప్పటికే ముగ్గురు నిందితుల అరెస్టు
- ఢిల్లీ-విజయవాడ డ్రగ్స్ సరఫరా చేసింది వీరే..
- నిందితులతో తరచూ మాట్లాడుతున్న 50 మంది
- అంతా కృష్ణా, గుంటూరు జిల్లాల విద్యార్థులే..
- విద్యార్థులు, తల్లిదండ్రులకు పోలీసుల పిలుపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఢిల్లీ నుంచి విజయవాడకు ఎండీఎంఏ డ్రగ్‌ను తీసుకొచ్చిన కేసులో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు చెందిన 50 మంది విద్యార్థుల పేర్లు బయటకొస్తున్నాయి. ఈ కేసులో మొత్తం ఐదుగురిని టాస్క్‌ఫోర్స్, పటమట పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. కాగా, నిందితుల సెల్‌ఫోన్లను విశ్లేషించగా, విద్యార్థుల జాతకాలు బయటపడ్డాయి. ఈ విద్యార్థులంతా వివిధ కళాశాలల్లో చదువుతున్నట్టు పోలీసులు గుర్తించారు. ఇప్పుడు వారందరినీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి పిలిపించాలని నిర్ణయించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులనూ పిలిచి కౌన్సెలింగ్ ఇవ్వాలని భావిస్తున్నారు.

ఆ ముగ్గురే..

ఢిల్లీ నుంచి కొరియర్ ద్వారా హైదరాబాద్‌కు ఈ డ్రగ్‌ను రప్పించుకుని, అక్కడి నుంచి నగరానికి తీసుకొస్తున్న తిరుమలశెట్టి జీవన్‌కుమార్, బొంతు నితీష్‌కుమార్, తూలిమెల్లి తరుణ్‌ప్రసాద్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. వారికి ఢిల్లీలోని నోయిడాకు చెందిన రింకీ ఈ సరుకును పార్శిల్ చేస్తున్నాడని నిర్ధారణైంది. ఈ ముగ్గురు నిందితుల్లో జీవన్‌కుమార్ ఎండీఎంఏను రప్పించడంలో కీలకంగా వ్యవహరించాడు. పామర్రుకు చెందిన మనోహర్ అనే యువకుడు ఈ ఎండీఎంఏ రుచిని తనకు చూపించినట్టు జీవన్‌కుమార్ అంగీకరించాడు. దీంతో మనోహర్‌తో పాటు మరో నిందితుడిని కొద్దిరోజుల క్రితం పటమట పోలీసులు అరెస్టు చేశారు.

విద్యార్థులే టార్గెట్‌గా..

విద్యార్థులే టార్గెట్‌గా జీవన్‌కుమార్ ఎండీఎంఏ డ్రగ్‌ను విక్రయించినట్టు దర్యాప్తులో తేలింది. తొలివిడతలో అరెస్టైన ముగ్గురు నిందితుల్లో తరుణ్‌ప్రసాద్ పెనమలూరు మండలం గంగూరులో ఉన్న ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. ఈ ముగ్గురు నిందితుల సెల్‌ఫోన్లను పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో విశ్లేషించారు. వారి సీడీఆర్ (కాల్ డేటా రికార్డు)ను పరిశీలించారు. ఈ ముగ్గురికి తరచూ 50 నెంబర్ల నుంచి ఫోన్లు రావడం, వెళ్లడం జరిగినట్టు గుర్తించారు. ఈ 50 నెంబర్లు ఎవరి పేర్ల మీద ఉన్నాయో పోలీసులు కూపీ లాగారు. వారంతా వివిధ కళాశాల్లో చదువుతున్నారని తేలింది.



అందులో కొంతమంది ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో, మరికొంతమంది ప్రైవేట్ డిగ్రీ కళాశాల్లో చదువుతున్నట్టు గుర్తించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆ జాబితాను సిద్ధం చేశారు. దీన్ని పోలీసు ఉన్నతాధికారుల ముందు పెట్టినట్టు తెలిసింది. వారి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని నిర్ణయించారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను టాస్క్‌ఫోర్స్ కార్యాలయానికి పంపి కౌన్సెలింగ్ చేయాలని భావిస్తున్నారు. ఈ విద్యార్థులంతా ఏడాదిగా ఈ ముగ్గురు నిందితులతో సంభాషిస్తున్నట్టు సమాచారం. ఇలా ఎండీఎంఏను తీసుకున్న వారిలో గుంటూరు జిల్లాకు చెందిన విద్యాసంస్థల్లోని విద్యార్థులు కూడా ఉన్నారు. తల్లిదండ్రులు ఇచ్చే రూ.100, రూ.200తో ఈ ఎండీఎంఏ కొంటున్నట్లు పోలీసులు గుర్తించారు. కాగా, ఆ విద్యార్థులంతా ఏయే కళాశాలల్లో చదువుతున్నారో తెలుసుకుని వాటి యాజమాన్యాలకు పోలీసులు నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.

మల్లాదిలో పామాయిల్ ప్లాంటేషన్

మల్లాది(అమరావతి) జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాదిలో పామాయిల్ మెగా ప్లాంటేషన్, సాగుపై రైతులకు గురువారం అవగాహన సదస్సును ఉద్యాన శాఖ నిర్వహించింది. జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది మండలాల్లో పామాయిల్ సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు. మల్లాదిలో మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా 10 ఎకరాల్లో మొక్కలు నాటినట్లు తెలిపారు. వంద శాతం రాయితీతో హెక్టార్‌కి 150 మొక్కలు చొప్పున అందజేస్తున్నట్లు వెల్లడించారు. విదేశీ మొక్కకు రూ.193, దేశీయ మొక్కకు రూ.133 లెక్కన మొత్తం రూ.29 వేల రాయితీ లభిస్తున్నట్లు చెప్పారు. రైతులు డ్రిప్ ఇరిగేషన్ పెట్టుకోవాలని సూచించారు. సాగు చేయదలచుకున్న రైతులు కచ్చితంగా నీటి వసతి, బోరు సదుపాయం, వేసవిలో నీళ్ల ఉంటేనే సాగు చేసుకోవాలన్నారు. డాట్ సెంటర్ శాస్త్రవేత్త నగేష్, పెద కూరపాడు ఉద్యాన అధికారి ఎస్.సురేష్, ఏఓ అహ్మద్, అమరావతి కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్లు, మేనేజర్ ఎం.నవీన్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

రేవేంద్రపాడు విద్యార్థినికి మంత్రి నారా లోకేశ్ ఆర్థిక సాయం


అసెంబ్లీ ఎన్నికల్లో రికార్డు మెజార్టీకి సమానమైన రూ.91,413 అందజేత

దుగ్గిరాల, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటిన రేవేంద్రపాడు విద్యార్థిని గంపా ఉమామహేశ్వరికి రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ రూ.91,413 ఆర్థిక సాయం అందజేశారు. ఈ నగదు సంఖ్య అసెంబ్లీ ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా తొలిసారిగా లోకేశ్ సాధించిన రికార్డు మెజార్టీకి సమానం. ఎన్నికల ప్రచారంలో భాగంగా రేవేంద్రపాడు వచ్చిన నారా లోకేశ్ హైస్కూల్‌లో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రేవేంద్రపాడుకు చెందిన గంపా ఉమామహేశ్వరి 575 మార్కులతో మండల ప్రథమ ర్యాంకు సాధించింది. ఎంపీటీసీ కొప్పుల మధుబాబు, హెచ్ఎం బట్టి వెంకటకృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరికి నగదు అందజేస్తున్న మంత్రి నారా లోకేశ్

క్వారీలపై ఆర్డీవో మధులత విచారణ



క్వారీయింగ్ జరుపుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

యడ్లపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపాలెం గ్రామ పరిధిలోని కొండ క్వారీల్లో విచక్షణా రహిత క్వారీయింగ్‌పై గ్రామస్తులు సోమవారం నరసరావుపేట కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన గుంజి శ్రీనివాసరావు మరో 24 మంది క్వారీయింగ్ వల్ల తమకు కలిగే నష్టాలను కలెక్టర్‌కు వివరించారు. దీంతో స్పందించిన కలెక్టర్ ఆదేశాలతో ఆర్డీవో మధులత గురువారం క్వారీలను సందర్శించారు. క్వారీయింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఫిర్యాదుదారులను పిలిచి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్వారీలలో నిబంధనలకు విరుద్ధంగా భూగర్భం లోతుల్లోకి మైనింగ్ చేస్తున్నారని, విచక్షణా రహితంగా ఎప్పుడు పడితే అప్పుడు భారీ బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని, అనుమతులు 7 క్వారీలకు మాత్రమే తీసుకుని 34 క్వారీలలో మైనింగ్ చేస్తున్నారని వివరించారు. దీంతో తమ ఇళ్ల గోడలు, స్లాబులు పగుళ్లు ఇస్తున్నాయని వాపోయారు. మైనింగ్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ కల్యాణి, సర్వేయర్ రవితేజ క్వారీయింగ్ నిబంధనలపై ఆర్డీఓ ప్రశ్నించారు. ఉప్పరపాలెం కొండలలో 34 క్వారీలు ఉన్నాయని, వీటిలో 7 క్వారీల యజమానులు మాత్రమే క్వారీయింగ్ జరుపుతున్నారన్నారు. ఎంత లోతు వరకు మైనింగ్ చేయవచ్చన్న నిబంధనపై స్పష్టంగా చెప్పలేక పోవడంతో పూర్తి సమాచారం, రికార్డులు తీసుకుని కార్యాలయానికి రావాలని ఆదేశించారు. కాగా, భారీ ఎత్తున బ్లాస్టింగ్ జరుగుతుంటే ఏంచేస్తున్నారంటూ ఎంపీడీవో, పంచాయితీ కార్యదర్శిని ఆర్డీవో నిలదీయడంతో వారు బిక్కుమొఖం వేశారు. తహసీల్దార్ విజయశ్రీ, ఎంపీడీవో హేమలతాదేవి, మండల సర్వేయర్ సురేంద్ర తదితరులు ఉన్నారు.

జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో సాదియాకు స్వర్ణం



పతకాలతో సాదియా

మంగళగిరి సిటీ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాట కలోని ధావన్‌గిరిలో జరుగుతున్న జూనియర్ నేషనల్ ఎక్విప్డ్ ఉమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఏపీ తరపున ప్రాతినిధ్యం వహించిన గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి షేక్ సాదియా అల్‌మాస్ స్వర్ణ పతకం సాధించింది. సాదియా స్క్వాట్‌లో 200.5 కిలోల బరువును ఎత్తి స్వర్ణ పతకంతోపాటు జాతీయ స్థాయిలో సరికొత్త రికార్డు నెలకొల్పింది. బెంచి ప్రెస్‌లో 97.5 కిలోల బరువును ఎత్తి స్వర్ణం, డెడ్ లిఫ్ట్‌లో 185.5 కిలోల బరువును ఎత్తి స్వర్ణం.. ఓవరాల్‌గా 483.5 కిలోల బరువును ఎత్తి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. జూనియర్ నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రెండు జాతీయ రికార్డులు సాధించి నాలుగు బంగారు పతకాలతో సత్తా చాటిన సాదియా అల్‌మాస్‌ను పవర్ లిఫ్టింగ్ ఇండియా అధ్యక్షుడు సతీశ్, ప్రధాన కార్యదర్శి జోసెఫ్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సంధాని, వైస్ ఛైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు మద్ది ప్రభాకర్ అభినందించారు.

ప్రజా చైతన్యంతోనే మాదక ద్రవ్య రహిత సమాజం

గుంటూరు కార్పొరేషన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్యంతో.. బలమైన రాజకీయ సంకల్పంతోనే మాదక ద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించుకోగలమని జార్ఖండ్ మాజీ డీజీపీ మండవ విష్ణువర్ధనరావు పేర్కొన్నారు. గురువారం గుంటూరు జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ మానవ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చర్చాగోష్ఠి జరిగింది. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఎంవీ రావు మాట్లాడుతూ..సంఘటితంగా డ్రగ్స్ వ్యాపారం చేస్తున్నారని, ఫిలిప్పీన్స్ లాంటి దేశాల్లో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని పేర్కొన్నారు. ఒక వ్యక్తి మత్తుకు బానిసైతే ఆ కుటుంబం పతనమవుతుందన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడు తూ.. మాదక ద్రవ్యాల దుర్వినియోగంలో భారతదేశంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా, ఏపీ రెండో స్థానం లో ఉందని తెలిపారు. ప్రపంచంలో మత్తు పానీయాలకు 80 కోట్లు, ఇండియాలో 15 కోట్లు, ఏపీలో 80 లక్షల మంది అలవాటు కలిగి ఉన్నట్లు గణాంకాలు వెల్లడించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. సమాజం మొత్తం ఉద్యమిస్తేనే మాదక ద్రవ్యాల రహితం సాధ్యమవుతుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడతూ.. ప్రభుత్వం మత్తుపదార్థాల నివారణకు కృషి చేయాలని కోరారు. సీపీఎం కార్యదర్శి నేతాజీ, మానవత ఛైర్మన్ రమేష్, కార్యదర్శి సతీష్, నేస్తం సహావ్యవ స్థాపకుడు ధనుంజయ్ రెడ్డి, అడ్వకేట్ కృష్ణ, కోవిడ్ ఫైటర్స్ నేత ముజీబ్ ప్రసంగించారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

సత్తెనపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయాధికార సేవా సంస్థ ఆదేశాల మేరకు జూలై 5వ తేదీన సత్తెపల్లి మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో సత్తెనపల్లిలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని మండల సమితి ఛైర్మన్ వీ విజయకుమార్‌రెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ తగాదాలు, బ్యాంక్ కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, మనోవర్తి కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, రెవెన్యూ కేసులు పరిష్కరిస్తామన్నారు. సత్తెనపల్లి సబ్‌డివిజన్ పరిధిలోని వారు వినియోగించుకోవాలని కోరారు.

చిత్తశుద్ధితో పని చేయాలి

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రతి నాయకుడు, కార్యకర్త చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో గురువారం నియోజకవర్గ స్థాయి పార్టీ సంస్థాగత సమావేశం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. నూతనంగా ఎన్నికైన మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యవర్గసభ్యులు అందరినీ కలుపుకొని పార్టీని బలోపేతం చేయాలన్నారు. రానున్న నాలుగేళ్లలో సత్తెనపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధికి చిరునామాగా నిలుపుతామన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులను, కార్యవర్గాన్ని కన్నా, పార్టీ నేతలు ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు కన్నాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు పుట్టినరోజు వేడుకలు నిర్వహించారన్నారు. సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, తాతా జయప్రకాష్ నారాయణ, ఎలినేడి రామస్వామి, కనుమూరి అనంతలక్ష్మి, సాతులూరి కుమార్, ఎం వీరారెడ్డి, షేక్ షరీఫ్, అచ్చిపల్లి బాలయ్య, చౌట శ్రీనివాసరావు, భీమినేని వందనాదేవి, అంకాళ్ళ ప్రభుదాసు, రావిపాటి నానయ్య, అంచుల నరసింహారావు, నూర్‌బాషా జానీబాబు, మస్తాన్‌వలి, ఆళ్ళ అమరేశ్వరరావు, బత్తుల నాగేశ్వరరావు, ఆవుల రాజు, పూజల వెంకట కోటయ్య, ముక్కపాటి రామచంద్రరరావు, సయ్యద్ పెదకరిముల్లా, తోట అంబిక, మన్నవ శారదాదేవి పాల్గొన్నారు.


మ్యూజియంను సందర్శిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకరరావు

నాగార్జున కొండను సందర్శించిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్

మాచర్ల రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా గురువారం నాగార్జునకొండను సందర్శించారు. కొండ మ్యూజియంలోని బుద్ధుని పాలరాతి విగ్రహం, శిలాశాసనాలు, రాతి పనిముట్లు, శిలాఫలకాలు సందర్శించారు. అనంతరం అనుపులోని అశ్వమేధ యజ్ఞశాల, శ్రీచైత్యం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీక్షించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జ్యోత్స్న, ఆర్కియాలజిస్ట్ కమల్‌హాసన్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి కేజీబీవీ విద్యార్థిని ఎంపిక

బెల్లంకొండ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి చదివిన ప్రసన్న నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి తెలిపారు. ట్రిపుల్ ఐటీకి ప్రసన్న ఎంపిక పట్ల ఎంఈవో రాజకుమారి, ఎంఈవో-2 బాలసుందరరావు అభినందించారు.

పాఠశాలల్లో తనిఖీ

అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అమరావతి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర పరిశీలకురాలు వనజ గురువారం తనిఖీ చేశారు. పాఠశాలల రికార్డులు, హాజరు నమోదును పరిశీలించారు. ఆమె వెంట ఎస్ఎస్ఏ బృందం ప్రతినిధులు సీఎంవో పద్మారావు, ఎంఐఎస్ శంకరరాజు, ఎంఈవో శివబాబు పాల్గొన్నారు.

29న వంగవీటి మోహన్‌రంగా విగ్రహావిష్కరణ

అచ్చంపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని ఆంజనేయుని విగ్రహం సెంటర్‌లో ఈ నెల 29న వంగవీటి మోహన్‌రంగ విగ్రహావిష్కరణ జరుగుతుందని అచ్చంపేట మండల కాపు సంఘం సభ్యులు గురువారం తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

సత్తెనపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పౌర, వృక్షశాస్త్రం సబ్జక్టులలో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ పోస్టుల గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కే పద్మ గురువారం విలేకరులకు తెలిపారు. దరఖాస్తు చేసుకోవటానికి ఈనెల 28 ఆఖరు తేదీ అన్నారు. ఇంటర్వ్యూ, డెమో క్లాసులు 30వ తేదీన నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంప్రదించాలని ఆమె తెలిపారు.

ఫ్లోరోసిస్‌పై అవగాహన

సత్తెనపల్లి రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామలోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రంలో గురువారం జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ, నివారణపై ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌వో, మండల స్థాయి సూపర్‌వైజర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గుంటూరు జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ మాట్లాడుతూ బోరులోని నీరు తాగటం, పొగాకు సంబంధిత వస్తువులు, బ్లాక్‌సాల్ట్, బ్లాక్ టీ వంటివి మితిమీరి ఉపయోగించిన వారు త్వరగా ఫ్లోరోసిస్ బారిన పడతారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పీ గౌతమి, ఆరోగ్య విస్తరణ అధికారి పీ శ్రీనివాసరావు, ఏ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా సురేష్ కుమార్

సత్తెనపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ బలిజేపల్లి సురేష్‌కుమార్‌ను నియమిస్తున్నట్టు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి అప్పగించిన ఎమ్మెల్యే కన్నా కృతజ్ఞతలు తెలిపారు.

డీలర్లు రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

నకరికల్లు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఎరువుల డీలర్లు తమ స్టాక్, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఏవో కే దేవదాసు అన్నారు. గురువారం నకరికల్లులో ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాల నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.

5400 మిర్చి టిక్కీల అమ్మకం

దాచేపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నడికూడి వ్యవసాయ మార్కెట్ యార్డుకు గురువారం 5800 మిర్చి టిక్కీలు రాగా 5400 టిక్కీల అమ్మకాలు జరిగాయి. 334 రకం రూ 8వేల నుంచి రూ 12వేలు, తేజా రకం రూ 9వేల నుంచి రూ 13,500, తాలుగాయాలు రూ 2వేల నుంచి రూ 7వేల వరకు ధరలు పలికాయి.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

● న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్

గురజాలటౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగం, వాటి అక్రమ రవాణా నేరమని సీనియర్ సివిల్ జడ్జి వై శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని జయభారత్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కేవీవీ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోట శ్రీనివాసరావు, న్యాయవాది షేక్ జానీబాషా, కళాశాల ప్రిన్సిపాల్ పుల్లారెడ్డి, లోక్‌అదాలత్ సిబ్బంది పాల్గొన్నారు. ఆర్డీవో మురళీకృష్ణ ఆధ్వర్యాన పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం బ్రహ్మనాయుడు సెంటర్లో మానవహారం జరిపారు. కార్యక్రమంలో కమిషనర్ శివన్నారాయణ, తహసీల్దార్ కుటుంబరావు, కూటమి నేతలు కటికం అంకారావు, అడపా శ్రీనివాసరావు, శరమాల హనుమంతురావు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ భాస్కర్ ఆధ్వర్యాన విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ వినోద్ కుమార్, అనంతకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

● మాచర్లటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీనివాస్‌కల్యాణ్ అన్నారు. పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో నిర్వహించిన మాదక ద్రవ్యాల వినియోగ వ్యతిరేక దినోత్సవ న్యాయ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వై రమేష్‌బాబు, కార్యదర్శి అనిల్, ప్రిన్సిపాల్ యనమదల వెంకట్రామయ్య, న్యాయవాది వై కృష్ణమూర్తి, మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు సూచనలు చేస్తున్న న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్


గురజాల: ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో మురళీకృష్ణ

● మాచర్ల రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలు విక్రయించినా, కొనుగోలు చేసిన శిక్షార్హులని మాచర్ల పట్టణ సీఐ పి.ప్రభాకరరావు అన్నారు. విద్యార్థులతో రింగురోడ్డు నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సంధ్యారాణి, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

● రెంటచింతల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మత్తు జీవితాలను చిత్తు చేస్తుందని ఎంపీడీవో కె.సరోజనిదేవి హెచ్చరించారు. సాగరమాత కళాశాల విద్యార్థులతో పురవీధుల్లో ర్యాలీ అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎలీషా రాజ్, తహసీల్దార్ మేరి కనకం, ఎంఈవో శివనాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సుమంత్ రెడ్డి, రాయపరెడ్డి, రామకృష్ణ, శివ, ప్రభురాజ్ యాదవ్, ఏపీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● దుర్గి: దుర్గిలో నిర్వహించిన ర్యాలీలో బస్టాండ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కారంపూడి: విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలై జీవితాలు నాశనం చేసుకోవద్దని ఎస్ఐ వాసు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపీడీవో గంట శ్రీనివాస్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నడుం బిగించాలి

బెల్లంకొండ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎంపీడీవో సునీత అన్నారు. గురువారం బెల్లంకొండలో అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కళాశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మద్యం, మాదక ద్రవ్యాల వైపు నుంచి యువతను కాపాడుకోవాలన్నారు. అనంతరం బెల్లంకొండలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లక్ష్మీ సులోచన ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● క్రోసూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల మహమ్మారిని తరిమి కొట్టేందుకు విద్యార్థులు, యువత నడుం బిగించాలని క్రోసూరు ఎక్సైజ్ సీఐ టీ తులసీ, తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ రమాదేవి అన్నారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఎక్సైజ్ సీఐ, కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి క్రోసూరు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద వివిధ శాఖల అధికారులతో తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

● అచ్చంపేట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గంజాయికి వ్యతిరేకంగా అధికారులు, పాఠశాల విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తహసీల్దార్ ఎస్ సరోజా, ఎంపీడీవో కే శ్రీనివాసరావు, సీఐ పీ శ్రీనివాస్, ఎంఈవో ఏకుల ప్రసాదరావు, సర్పంచ్ ఎస్‌కే జానీ, ఎనిగండ్ల కోటయ్య, ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శి పంతుల నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం, పద్మ తదితరులు పాల్గొన్నారు.

● పెదకూరపాడు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగం ప్రజల మనుగడకే ప్రమాదమని తహసీల్దార్ నీలి ధనలక్ష్మి అన్నారు. పెదకూరపాడులో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ హేమలత, ఇన్‌చార్జ్ ఎంపీడీవో సోమయాజులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో శరీరంలోని అన్ని అవయవాలు దెబ్బతింటాయని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ వీ శ్రీనివాసులు అన్నారు. పెదకూరపాడులోని కాకతీయ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అశోక్‌బాబు, ఎస్ఐ పీర్ హుస్సేన్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

● అమరావతి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీని అమరావతిలో నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఐ అచ్చయ్య, స్పెషల్ ఆఫీసర్ రాజగోపాల్, ఎంఈవో శివబాబు, ఎంపీడీవో పార్వతి, ఎంపీపీ మేకల హనుమంతరావు, ఎస్ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పెదకూరపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


బెల్లంకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


క్రోసూరులో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ తులసీ

మత్తు పదార్థాలు జీవితాన్ని చిదిమేస్తాయి..


రాజుపాలెం బస్టాండ్ సెంటర్లో చేస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ, ఎంఈవో మల్లికార్జున శర్మ, ఎస్సై వేణుగోపాల్ తదితరులు

రాజుపాలెం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలు జీవితాన్ని చిదిమేస్తాయి వద్దు బ్రో... డ్రగ్స్‌కి నో చెప్పండి... డ్రగ్స్ మీ కుటుంబాన్ని కూడా నాశనం చేస్తుందనే నినాదాలతో రాజుపాలెం గ్రామం ధ్వనించింది. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజుపాలెంలోని ఎంపీడీవో కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవీ సత్యానారాయణ, డీటీ జానీభాష, ఎంఈవో మల్లికార్జునశర్మ, ఎస్సై వేణుగోపాల్, సర్పంచ్ పసుపులేటి వెంకటస్వామి, గడేషు వెంకట్రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉం డాలని సత్తెనపల్లి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ విజయకుమార్ అన్నారు. మండలంలోని ధూళిపాళ్ళ లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో మద్యపానం, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఏపీపీ భగ్గి నరసింహారావు, సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మణరావు, కళాశాల మేనేజ్‌మెంట్ ఎల్ అజయ్, ఎక్సైజ్ ఎస్ఐ కే నాగలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నకరికల్లు: ప్రతి ఒక్కరు డ్రగ్స్‌కు, గంజాయికి దూరంగా ఉండాలని తహసీల్దార్ కే పుల్లారావు కోరారు. నకరికల్లు వై జంక్షన్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి సీడీపీవో టీ శ్రీలత, ఎంపీడీవో జీ కాశయ్య, ఈవోఆర్డీ శివప్రసాదు, రజియా బేగం, ఉసర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● ముప్పాళ్ల: మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగంగా ఎంపీడీవో రత్నం, తహసీల్దార్ నగేష్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ముప్పాళ్లలో మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు ప్లకార్డులను చేబూని ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డీటీ లక్ష్మీప్రసాద్, ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు... ఆరోగ్యమే ముద్దు

● పోలీసుల ర్యాలీ.. మానవహారం

పిడుగురాళ్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిడుగురాళ్ల తహసీల్దార్ జె.మధుబాబు తెలిపారు. నో డ్రగ్స్‌పై గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించి ఐలాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐలు శివనాగరాజు, మోహన్‌లు మాట్లాడుతూ ఎక్కడైనా మాదకద్రవ్యాల ఆనవాళ్లు వున్నట్లైతే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● దాచేపల్లి: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే శారీరక, మానసిక అనారోగ్యం పాలవుతారని తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ హెచ్చరించారు. దాచేపల్లి ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ప్రతి జ్ఞ నిర్వహించారు. నారాయణపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్ఐ పాపారావు, సౌదర్‌రాజన్ పాల్గొన్నారు.

● మాచవరం: మాచవరంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తహసీల్దార్ కార్యాలయం నుంచి గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ర్యాలీలో టీడీపీ మండల అధ్యక్షుడు బడిగుంతల వెంకటేశ్వర్లు, యడ్లపల్లి రామారావు, పుసులూరి రామయ్య, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో చిరంజీవి, ఏఎస్ఐ శేఖర్, చల్లాపల్లి నరసింహారావు, సర్పంచ్ రాగిడి నరేష్, వైద్యాధికారి ప్రసాదు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.


పిడుగురాళ్లలో మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు


దాచేపల్లి: నారాయణపురం ర్యాలీలో పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, సీఐ భాస్కరరావు


ట్యాబ్‌లు అందజేస్తున్న ఛైర్మన్ మదార్‌సాహెబ్

ఆర్‌పీలకు ట్యాబ్‌లు పంపిణీ

మాచర్లటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని మెప్మాలో విధులు నిర్వహిస్తున్న ఆర్‌పీలకు గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు చేసే ప్రతి పని ఇక నుంచి యాప్‌లో ఆన్‌లైన్ చేయాల్సిందిగా ప్రభుత్వం సూచించిందన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం శ్యామలాదేవి, సీవో అంజలి తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు అందుకుంటున్న ఉద్యమకారుడు మందకృష్ణ

దుర్గి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అందుకుంటున్న ఉద్యమకారుడు మందకృష్ణ మాదిగ అని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికారప్రతినిధి, జిల్లా ఇన్‌చార్జి డి.రామకృష్ణ అన్నారు. స్థానిక ఏఈఎల్‌సీ చర్చి ఆవరణలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి కందుకూరి రమేష్ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రత మీదనే భూమండలం ఆధారపడి ఉంది

రెంటచింతల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ భద్రత మీదే భూమండలం ఆధారపడి ఉందని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎస్ రాజు అన్నారు. జాతీయ విద్యుత్ భద్రత వారోత్సవాల్లో భాగంగా గురువారం ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్మికులనుద్దేశించి రాజు మాట్లాడుతూ అన్ని మోటార్లకు డబుల్ ఎర్తింగ్ వుండాలని చెప్పారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్, రూఫ్‌టాప్ సోలార్ వంటివాటి గురించి వివరించారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ విభాగాధిపతి ఎ.వెంకట్రావ్, మల్లికార్జున, వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

ఆటోలు నిబంధనల మేరకే నడపాలి

మాచవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నిబంధనలమేరకే ఆటోలు నడపాలని ఎస్ఐ తిరుపతిరావు డ్రైవర్లకు సూచించారు. గురువారం పిన్నెల్లి ఆటోడ్రైవర్లకు పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. పరిమితికి మించి ప్రయాణీకులను ఎక్కించుకోకూడదని వివరించారు.

విద్యుత్ వాడకంపై అవగాహన ఉండాలి

ఏపీ ముఖ్య విద్యుత్ తనిఖీ అధికారి విజయలక్ష్మి

దాచేపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలు జరగకుండా విద్యుత్ వాడకంపై అవగాహన ఉండా ఏపీ విద్యుత్ తనిఖీ అధికారి జీ విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల ప్రారంభ వేడుకల్లో భాగంగా మండలంలోని ఆంధ్రా సిమెంట్ దుర్గాపురంలో జరిగిన వారోత్సవాలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత ఆంధ్రా సిమెంట్ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు ఆధ్వర్యంలో భద్రతా పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ హెచ్‌వోడీ గణేష్, గణేష్, పణికుమార్, శ్రీనగర్ సర్పంచ్ నాగిరెడ్డి, పడాల సైదులు, కార్మికులు, ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు సమావేశంలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఈఐజీ విజయలక్ష్మి, సుబ్బారావు


విద్యాశాఖాధికారులతో సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

సంస్కరణల దిశగా ప్రభుత్వం చర్యలు

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యలో సమూల మార్పులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో సంస్కరణలకు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను కోరారు. గురువారం వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో విధిగా అమలుచేయాల్సిన అంశాలపై అధికారులకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. మన బడి-మన భవిష్యత్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాలలో అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. విద్యార్థులకు కెరియర్ గైడెన్స్ సోషల్ అవేర్నెస్‌పై ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి శనివారం నిర్వహించే మాస్ డ్రిల్‌లో భాగంగా విద్యార్థులతో యోగా చేయించాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పంగులూరి పుల్లయ్య, మాచర్ల ఎంఈవో అల్లి సురేష్, బాలికల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభాగ్యుల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

అభాగ్యుల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మాచర్ల మండలం పశువేముల గ్రామానికి చెందిన బెజవాడ రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. మంజూరైన రూ.3.08లక్షల నగదు చెక్కును ఎమ్మెల్యే, రమేష్ భార్య మరియమ్మకు అందించారు.

పిచ్చివేషాలు వేస్తే తాటతీస్తాం...

మాచర్ల రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పిచ్చి వేషాలు వేస్తే తాటతీస్తాం అంటూ వైసీపీ నేతలపై ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఏకోనాంపేటలో ఆయన పర్యటన సందర్భంగా గ్రామస్తులు తాగునీటి సమస్యపై ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం వేసిన బోర్ల నుంచి నీరు రాకుండా వైసీపీ నేతలు అడ్డుకుంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నీటి పైపులను కోసి నీటి మోటారును బోరుబావిలో పడేశారన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఇంత జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారంటూ విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్‌ను ఫోన్లో నిలదీశారు. ఇటువంటి వారిని విచారించి కేసు నమోదు చేయాలన్నారు. తక్షణమే గ్రామంలో పర్యటించి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలన్నారు.

ఘనంగా కన్నా నాగరాజు జన్మదిన వేడుకలు


సత్తెనపల్లి: కన్నా నాగరాజు పుట్టిన రోజు వేడుకల్లో కేక్ తినిపిస్తున్న పార్టీ నేతలు

రాజుపాలెం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమోడు శివారు వీరమ్మకాలనీలో ఉన్న అనాథ పిల్లల, వృద్ధాశ్రమంలో గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ తెలుగుయువత ఉపాధ్యక్షుడు శనగపూల వెంకయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆశ్రమంలో అన్నదానం చేశారు.

● నకరికల్లు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు పుట్టిన రోజు వేడుకలను నకరికల్లు టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తిరుమలశెట్టి వెంకటరావు, ఆకుల పెదవెంకటేశ్వర్లు, వేల్పుల ఆవుల రాజు, షైలవరపు కాశీ, భవనాసి కిషోర్, ఇర్ల శ్రీహరి, జి.శివయ్య, జి.ఆంజనేయులు, డి.హుస్సేన్‌బీ, బి.ఏడుకొండలు పాల్గొన్నారు. అడ్డరోడ్డులో నాగరాజు జన్మదిన వేడుకలు నిర్వహించారు.

● ముప్పాళ్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కన్నా నాగరాజు జన్మదిన వేడుకలను ముప్పాళ్ల టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, జనసేన మండలాధ్యక్షుడు శిరిగిరి పవన్‌కుమార్, నాయకులు ఉన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి


వినోద్‌బాబు మృతదేహం

మాచర్లటౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆగిఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మాచర్లలో జరిగింది. పట్టణంలోని చెన్నకేశవ కాలనీకి చెందిన కామినేని వినోద్‌బాబు(40) బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై గోగుల వెంకటేశ్వర్లుతో కలిసి రాయవరం జంక్షన్ వైపు నుంచి పట్టణంలోకి వస్తూ రిలయన్స్ పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న లారీని వెనుకగా ఢీకొట్టారు. ఈ సంఘటనలో తీవ్రగాయాలైన వినోద్‌బాబును పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుని భార్య శిరీషా ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారులపై దమ్ము ట్రాక్టర్లు తిప్పితే కఠినచర్యలు

కారంపూడి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రహదారులపై దమ్ము ట్రాక్టర్లు తిప్పితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ వాసు హెచ్చరించారు. స్థానిక పోలీసు స్టేషన్లో మండలంలోని ట్రాక్టర్ డ్రైవర్లకు ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రోడ్లు దెబ్బతింటున్నాయన్నారు.నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు మండల పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం

మాచర్ల రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు మండల పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఫణికుమార్ నాయక్ అన్నారు.

అనుమతులు లేని మందులు అమ్మితే చర్యలు

ముప్పాళ్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): దుకాణాలలో అనుమతులు లేకుండా ఎరువులు, పురుగుమందులు అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని శ్రీధర్‌రెడ్డి అన్నారు. వ్యవసాయశాఖ కార్యాలయంలో డీలర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. డీలర్లు బిల్లు పుస్తకాలు, స్టాక్‌బోర్డులు కన్పించేలా ఏర్పాటుచేయాలన్నారు. నిర్దిష్ట ధరలకు మాత్రమే అమ్మాలని సూచించారు.

పోలీసు శాఖకు కృత్రిమ మేధ

- ఇన్నోవేటివ్ హ్యాకథాన్-2025కి గుంటూరు వేదిక
- 27, 28, 29 తేదీల్లో చౌడవరం ఆర్‌వీఆర్ కళాశాలలో నిర్వహణ
- తొలి రోజున హాజరుకానున్న సీఎం చంద్రబాబు, హోం మంత్రి, డీజీపీ

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ(ఆర్టీఫిషియల్ ఇంటెలిజెన్స్)ని అందిపుచ్చుకొనేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ సిద్ధమైంది. కేసుల దర్యాప్తులో సాంకేతికంగా ఎదురౌతున్న సవాళ్లను అధిగమించేందుకు ఏఐని వినియోగించుకోవాలని నిర్ణయించింది. ఇందుకోసం జాతీయ స్థాయి హ్యాకథాన్‌ని ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనుంది. గుంటూరు పశ్చిమ మండలంలోని చౌడవరంలో ఉన్న ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యాకథాన్ నిర్వహణకు పోలీసు శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలి రోజున జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, పోలీసు ఉన్నతాధికారులు, ఆర్టీఫిషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులు హాజరుకానున్నారు. శని, ఆదివారంలలో టెక్నికల్ సెషన్స్ జరుగుతాయని పోలీసు అధికారవర్గాలు తెలిపాయి.

ఏఐ ఫర్ ఆంధ్రపోలీసు ఇన్నోవేషన్ హ్యాకథాన్ - 2025 పేరుతో నిర్వహించబోతున్న ఈ కార్యక్రమానికి పోలీసు శాఖ ప్రత్యేక వెబ్‌సైట్‌ని రూపొందించింది. గత కొన్ని రోజులుగా ఈ హ్యాకథాన్‌లో పాల్గొనేందుకు రిజిస్ట్రేషన్స్ నిర్వహిస్తోన్నది. అలానే వలంటీర్లుగా పని చేసేందుకు కూడా రిజిస్ట్రేషన్ చేసుకొనేందుకు వెబ్‌సైట్ ద్వారా అవకాశం కల్పించింది. ఆపరేషన్స్ అండ్ టెక్నికల్ సర్వీసెస్ ఐజీపీ డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్, ఫోర్ సైట్ ఏఐ సీఈవో సూర్య కొత్త కీలకోపన్యాసం చేస్తారు. నేటి సమాజంలో పోలీసు శాఖ ఎనిమిది అత్యధిక ప్రభావిత వినియోగ కేసులను గుర్తించింది. తరచుగా నమోదు అవుతున్న ఈ కేసులను పరిష్కరించేందుకు కృత్రిమ మేధ ద్వారానే సాధ్యమని అభిప్రాయపడుతున్నది. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా నిపుణులను ఈ హ్యాకథాన్‌కి ఆహ్వానించింది. మూడు రోజుల పాటు జరిగే టెక్నికల్ సెషన్స్‌లో సమస్యలు, సవాళ్లపై చర్చించి పరిష్కారాలను కనుగొనాలనేది ప్రధాన లక్ష్యం. పబ్లిక్ సర్వీసు, లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో సమస్యలకు పరిష్కారం కనుగొనడానికి ఇదొక గొప్ప వేదిక అవుతుందని పేర్కొంటున్నది.



ఆర్‌వీఆర్ కళాశాలలో పోలీసు శాఖకు కృతిమ మేధ హ్యాకథాన్ నిర్వహణకు చేసిన ఏర్పాట్లు

ఎనిమిది కేసులు ఇలా..

పీఎస్/ఎస్‌పీ/సీవో స్థాయిలో స్వీకరించిన పిటీషన్లను విశ్లేషించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు ఏఐ సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. దీనికి విజయనగరం ఎస్‌పీ వకుల్ జిందాల్ మెంటార్‌గా వ్యవహరిస్తారు. రెండో కేసుగా ఏఐ పవర్డ్ సీసీటీఎన్ఎస్ డేటా నుంచి స్వర ఆధారిత సహజ భాషలో ప్రశ్నించడం, రిపోర్టు జనరేట్ చేయడం. దీనికి మెంటార్‌గా ఐపీఎస్ అధికారి సిద్ధార్థ కౌశల్ వ్యవహరిస్తారు. మూడో కేసుగా ఏఐ పవర్డ్ సోషల్ మీడియాలో స్పాన్సర్డ్ స్కామ్ యాడ్స్‌ని గుర్తించడం, రిపోర్టు చేయడం. దీనికి హ్యాష్‌ట్యాగ్ ఇంటెలిజెన్స్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ యాక్షన్ కోసం కంటెంట్ విశ్లేషించడం. దీనికి మెంటార్‌గా ఏపీఎస్‌పీ బెటాలి యన్ డీఐజీ డాక్టర్ ఫకీరప్ప కగినెల్లి వ్యవహరిస్తారు. నాల్గో కేసుగా ఏఐ పవర్డ్ సీడీఆర్/ఐపీడీఆర్‌కు చెందిన పెద్ద వాల్యూ మ్స్‌ని విశ్లేషించడం. ఈ కేసుకు మెంటార్‌గా ఏలూరు ఎస్‌పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ఉంటారు. డయల్ 112, క్రైం హాట్‌స్పా ట్‌లకు ఎఫ్ఐఆర్‌లు జనరేట్ చేయడం, లాండ్ అండ్ ఆర్డర్ కాపాడేందుకు వేగవంతంగా హెచ్చరికలు పంపేందుకు ఏఐ విశ్లేషణ చేయడం కోసం ఐదు కేసుని నిర్ణయించారు. దీనికి ఐదో బెటాలియన్ కమాండెంట్ మల్లిక గార్గ్ మెంటార్‌గా ఉంటారు. ఆరో కేసుగా రివార్డులు, మెడల్స్ మూల్యాంకనం చేసేందుకు డిజిటల్ సర్వీసు రికార్డు పుస్తకాలను ఏఐ ద్వారా విశ్లేషిచండం. దీనికి ఐజీపీ బీ రాజకుమారి మెంటార్‌గా ఉంటారు. వాట్సాప్, గ్రూపు చాట్స్ డేటాని ఏఐ ద్వారా విశ్లేషించి ముఖ్యమైన అంశాలను గుర్తించడం, ముందస్తు హెచ్చరికలు పంపేందుకు ఆరో కేసుగా నిర్ణయించారు. దీనికి విజయనగరం ఎస్‌పీ వకుల్ జిందాల్ మెంటార్‌గా ఉంటారు. ప్రాంతీయ, ఆంగ్ల దినపత్రికల్లో ప్రచురితమైన వార్తలను ఏఐ ద్వారా విశ్లేషించేందుకు ఎనిమిదో కేసుని తీసుకొన్నారు. దీనికి ఐదో బెటాలియన్ కమాండెంట్ మల్లిక గార్గ్ మెంటార్‌గా వ్యవహరిస్తారు.

ఒక్కో కేసు పరిష్కారానికి నగదు బహుమతులు

పోలీసు శాఖ గుర్తించిన ఎనిమిది హై ఇంపాక్ట్ కేసుల్లో అత్యుత్తమమైన పరిష్కారమార్గాన్ని చూపించిన సాంకేతిక నిపుణులకు నగదు బహుమతిని కూడా ప్రదానం చేయనుంది. ఒక్కో కేసుకు ప్రథమ బహుమతి కింద రూ. 75 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 50 వేలు నగదుని ఇస్తామని ప్రకటించింది. దీంతో దేశ వ్యాప్తంగా అనేకమంది సాఫ్టువేర్ రంగ నిపుణులు రిజిస్ట్రేషన్స్ చేసుకొన్నారు. ముఖ్యంగా శని, ఆదివారంలలో ఈ హ్యాకథాన్‌కు హాజరయ్యేందుకు రానున్నారు.



సమావేశంలో పాల్గొన్న చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ విశ్వశ్రీ

పొగాకు ఉత్పత్తి లక్ష్యం కుదింపు

- 2025-26 పంటకాలానికి 142 మిలియన్ కేజీల పరిమాణం నిర్ధారణ
- గత ఏడాదితో పోల్చితే 25 మిలియన్ కేజీలను తగ్గించిన పొగాకు బోర్డు
- ధర పతనం కావడమే కారణని బోర్డు సమావేశంలో నిర్ణయం

గుంటూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తి లక్ష్యాన్ని టుబాకో బోర్డు కుదించింది. 2025-26 పంటకాలానికి 142 మిలియన్ కేజీల ఉత్పత్తిని నిర్ధారించింది. గురు వారం గుంటూరు నగరంలోని పొగాకు బోర్డు కార్యాలయంలో జరిగిన 165వ సమావేశంలో ప్రజాప్ర తినిధులు, అధికారులు చర్చించి ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. టుబాకో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఈడీ బీ విశ్వశ్రీ, బెంగళూరు ఆక్షన్స్ డైరెక్టర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ బొడ్డపాటి బ్రహ్మయ్య, బోర్డు సభ్యులు జీసీ విక్రమ్ రాజ్, గుత్తా వాసుబాబు హాజరయ్యారు. సమావేశంలో ప్రధానంగా ప్రస్తుత సంవత్సరంలో పొగాకు రైతుకు తలెత్తిన నష్టాలు, విదేశాల నుంచి వస్తున్న ఎగుమతి ఆర్డర్లు గురించి చర్చించడం జరిగిందని చైర్మన్ యశ్వంత్‌కుమార్ తెలిపారు. గత రెండేళ్లలో భారత్‌తో పోటీపడి పొగాకు పండించే బ్రెజిల్, జింబాబ్వే, టాంజానియా, మొజాంబికా తదితర దేశాల్లో పంట తక్కువగా ఉండటం వలన ఇక్కడి రైతులకు అధిక లాభాలు వచ్చాయన్నారు. పొగాకు బోర్డు చరిత్రలో రికార్డు స్థాయిలో 240 మిలియన్ కేజీల పొగాకుని రైతులు ఉత్పత్తి చేశారన్నారు. వాస్తవానికి 2024-25 సంవత్సరానికి 167 మిలియన్ కేజీల ఉత్పత్తినే లక్ష్యంగా నిర్ధారించడం జరిగిందని, అయితే రైతులు అనధికారికంగా వర్జీనియా పొగాకుతో పాటు లోగ్రేడ్, నల్లబర్లీ వంటి రకాలు సాగు చేశారన్నారు. దీని వలన డిమాండ్ లేక ధర తగ్గిందన్నారు. రైతుల ఆందోళనల దృష్ట్యా ఇటీవలే కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ టుబాకో బోర్డు కార్యాలయానికి వచ్చి ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆ మేరకు 16 వేలం కేంద్రాలకు లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ప్రకాశం, నెల్లూరు, బాపట్ల, నరసరావుపేట, ఏలూరు, జంగారెడ్డిగూడెం, గుంటూరులో ఉత్తరాది తేలికపాటి నేలలు, దక్షిణాది తేలికపాటి నేలలు, దక్షిణాది నల్లరేగడి భూములకు లక్ష్యాలను ఇస్తామన్నారు. బ్యారన్ల వారీగా విభజించి రైతులకు అన్ని వివరాలను తెలియజేస్తామని చెప్పారు. పొగాకు పండించే రైతులంతా బోర్డు నిర్ధారించిన విధంగా పంట పరిమాణానికి లోబడి ఉత్పత్తి చేసి మెరుగైన ధరలను పొందాలని సూచించారు. ఈ సమావేశానికి వర్చువల్ విధానంలో లోక్‌సభ సభ్యుడు పీ మహేష్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కే లక్ష్మణ్, వాణిజ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మౌనిక గౌర్, నిర్మా రాజమండ్రి డైరెక్టర్ మాగుంట శేషు మాధవ్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్ ఢిల్లీరావు, కర్ణాటక వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ జీటీ పుత్ర, గుజరాత్, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల నుంచి అధికారులు హాజరయ్యారు.

నిబంధనలు సడలింపు

(5వ పేజీ తరువాయి)

నిలిపివేసుకుంటున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో దాదాపు మూడున్నర నెలలుగా ప్లాన్‌లు మంజూరు కాక నిర్మాణాలు నిలిచిపోయాయి.

క్రిమినల్ కేసు నిబంధన ఉపసంహరణ

పట్టణాల్లో ఇళ్ల నిర్మాణానికి సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ ద్వారా ప్లాన్‌లను పురపాలక సంఘం మంజూరు చేస్తోంది. ఇది భవన నిర్మాణదారులకు ఎంతో మేలు చేస్తుందని ప్రభుత్వం భావించింది. దీంతో అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన పని ఉండదని ప్రకటించింది. కానీ, నిర్మాణదారుడు మంజూరైన ప్లాన్ ఉల్లంఘించి భవనం నిర్మిస్తే.. లైసెన్స్ రద్దు చేసి, కేసులు నమోదు చేసే విధంగా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ క్రిమినల్ కేసు నిబంధనను ప్రభుత్వం ఉపసంహరిం చుకుంది. మరో పెద్ద సమస్యగా ఉన్న సెట్‌బ్యాక్ విషయంలో కూడా మార్పులు తీసుకొచ్చింది. కొత్త నిబంధన ప్రకారం భవన నిర్మాణానికి రోడ్డు వైపు మూడు మీటర్లు స్థలం వదలాలి. అయితే ఒక మీటరు స్థలం వదిలితే సరిపోతుందని సడలించిన నిబంధనల్లో పేర్కొంది. పట్టణాల్లో లైసెన్స్‌డు సర్వేయర్లు ఇళ్ల నిర్మాణాల ప్లాన్‌లకు దరఖాస్తు చేస్తున్నారు.

మీరితే.. ఎల్‌టీపీలపై వేటు..!

భవన నిర్మాణం కోసం ఆన్‌లైన్‌లో ప్లాన్ నమోదు చేసి, మున్సిపాలిటీకి ఫీజు చెల్లిస్తే అప్రూవల్ వచ్చేస్తుంది. దీంతో నిర్మాణదారుడు వెంటనే ప్లాన్ ప్రకారం పనులు ప్రారంభించవచ్చు. అయితే ఏ కొద్ది పాటి అతిక్రమణ జరిగినా ఎల్‌టీపీలపై వేటు పడుతుంది. ఆరు నెలల పాటు వారిని బ్లాక్ లిస్టులో పెడతారు. ఇటువంటివి పునరావృతమైతే వారి లైసెన్స్ రద్దు చేస్తారు. ఈ నిబంధనను మాత్రం ప్రభుత్వం సడలించలేదని ఎల్‌టీపీలు చెబుతున్నారు.

టౌన్ ప్లానింగ్ చేతిలో నుంచి..

కొత్త విధానం వల్ల పట్టణంలో ప్రతి భవనం నిర్మాణానికి నిబంధనలు పాటించాలి. ఉదాహరణకు 300 చదరపు మీటర్లలో భవన నిర్మాణం చేస్తే.. గతంలో కొంత సడలింపు ఉండేది. మార్టుగేజ్ ఉండడంతో చిన్న చిన్న తేడాలు ఉన్నా పెద్దగా పట్టించుకునేవారు కాదు. ఇప్పుడా పరిస్థితి లేదు. గతంలో టౌన్ ప్లానింగ్ అధికారులు ప్లాన్ ఇచ్చేవారు. కొత్త నిబంధనల ప్రకారం ఎల్‌టీపీ ప్లాన్‌లు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే సదరు అధికారులతో పని లేకుండా ప్లాన్ మంజూరవుతుంది. అపార్ట్‌మెంట్ల విషయంలోనూ ఇదే పరిస్థితి. జీ ప్లస్-5కు గతంలో టౌన్ ప్లానింగ్ ఆర్డీ పరిశీలించి అమోదం తెలిపేవారు. ఏమైనా అభ్యంతరాలుంటే మార్పులు చేసి, ప్లాన్ ఇచ్చేవారు. ఇప్పుడది ఉండదు. మొత్తంమ్మీద కొత్త నిబంధనలు సడలించడంతో యజమానులు భవనాల నిర్మాణాలను ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్నారు.

ఆడుదాం ఆంధ్రా.. అవినీతిమయం

(5వ పేజీ తరువాయి)

విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు అవినీతికి సంబంధించిన ఆధారాలు సేకరిస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లి అప్పట్లో ప్రభుత్వం ద్వారా పంపిణీ అయిన క్రికెట్ కిట్లు ఉన్నాయా లేదా.. కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించారా లేదా అని అధికారులు పరిశీలిస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అటవీశాఖాధికారి సైదులు ఆధ్వర్యంలో విచారణ జరుగుతున్నట్లు తెలుస్తుంది. రెండు నెలలుగా జరుగుతున్న విచారణ మరో 10 రోజుల్లో పూర్తి చేసి నివేదికను ప్రభుత్వానికి అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని తెలుస్తుంది.

క్రికెట్ ఆడకుండానే..

గుంటూరు జిల్లాలో 568 సచివాలయాల పరిధిలో 1,29,504 మందికి, 64,752 టీమ్‌లు, పల్నాడు జిల్లాలో 538 సచివాలయాలకు 1,22,664 మందికి 61,332 టీమ్‌లు, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాలకు 1,08,756 మందికి 54,378 టీమ్‌లు క్రికెట్ ఆటలో పాలుపంచుకున్నట్లు రికార్డుల్లో చూపారు. ఆ జాబితాల్లోని పలువుర్ని అధికారులు పిలిచి విచారించగా అసలు తమకు ఆడుదాం ఆంధ్రా.. క్రికెట్ ఆట గురించే తెలియదని చెప్పినట్లు తెలుస్తోంది. తాము ఆడకుండానే పేర్లు రాసుకున్నారని చాలామంది చెప్పినట్లు సమాచారం. ఈ మేరకు వారి వాంగ్మూలాలను అధికారులు రికార్డు చేశారు. ఇక రూ.20 వేలు వెచ్చించి క్రికెట్ కిట్లను కొనుగోలు చేశారు. అయితే ఆటల అనంతరం క్రికెట్ కిట్లను మండల విద్యాశాఖాధికారికి అప్పగించాలని ప్రభుత్వం సూచించింది. అయితే ఎక్కువ సచివాలయాల్లో వైసీపీ నాయకులు, వారి అనుచరులకు కిట్లను పందారం చేసినట్లు తెలుస్తుంది. ఈ కార్యక్రమం సందర్భంగా భోజన ఏర్పాట్లకు ఒక్కో వార్డు సచివాలయానికి రూ.లక్ష, గ్రామ సచివాలయానికి రూ.10 వేలు, మండల స్థాయిలో ఎంపీడీవోకు రూ.50 వేల వరకు కేటాయించారు. అయితే ఆ బిల్లులను పరిశీలించిన అధికారులు భోజనాలు పెట్టకపోయినా పెట్టినట్లు చూపించి రూ.50 లక్షలు స్వాహా చేశారని అధికారులు గుర్తించారని సమాచారం. జగన్ బొమ్మతో ఉన్న వేల టీ షర్టులు సచివాలయాల్లో దుమ్ముతో నిండిపోగా వాటి విలువను అధికారులు లెక్కిస్తున్నారు.

విద్యుత్ శాఖ.. సర్కిల్స్ పునర్విభజన

- గుంటూరు, సీఆర్‌డీఏ, బాపట్ల, పల్నాడు సర్కిల్స్‌లో సబ్ డివిజన్‌ల మార్పులు
- సీఆర్డీయే సర్కిల్‌లో కొత్తగా అమరావతి క్యాపిటల్ డివిజన్ ఏర్పాటు

గుంటూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో సర్కిల్స్ పునర్విభజన ప్రక్రియ ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. ప్రస్తుతమున్న జిల్లాల వారీగా సర్కిల్స్‌ను కొనసాగిస్తూ.. అందులో సబ్ డివిజన్‌లలో మార్పులు, చేర్పులు చేస్తూ విభజన ప్రక్రియను పూర్తి చేశారు. ఈ మేరకు సర్కిల్స్ విభజనకు సంబంధించి ఉత్తర్వులను సీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జిల్లాల పర్యటనలో భాగంగా గుంటూరు సర్కిల్ పర్యటనకు వచ్చిన సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్ సంస్థలో సర్కిల్స్ పునర్విభజన ప్రక్రియ చేపట్టామని తెలిపారు. గుంటూరు, పల్నాడు, సీఆర్డీయే, బాపట్ల సర్కిల్స్‌లో ప్రస్తుతం ఉన్న డివిజన్‌లనే కొనసాగిస్తూ సబ్ డివిజన్‌లలో మార్పులు, చేర్పులు చేస్తూ విభజన ప్రక్రియ చేపట్టారు.

● సీఆర్డీయే సర్కిల్‌లో..

మంగళగిరి డివిజన్‌తో పాటు రాజధాని ప్రాంతమైన రాయపూడి కేంద్రంగా అమరావతి క్యాపిటల్ పేరుతో కొత్తగా డివిజన్‌ను ఏర్పాటు చేశారు. గతంలో సీఆర్‌డీఏలో చిలకలూరిపేట, మంగళగిరి కేంద్రంగా అమరావతి డివిజన్ ఉండేది.. దాన్ని తాజాగా పేరు మార్చి రాయపూడి కేంద్రంగా అమరావతి క్యాపిటల్ డివిజన్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అమరావతి క్యాపిటల్ డివిజన్ లో అమరావతి టౌన్, అమరావతి రూరల్, మంగళగిరి టౌన్, మంగళగిరి రూరల్ పేరుతో నాలుగు సబ్ డివిజన్‌లు కాగా... 13 సెక్షన్ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. గతంలో సీఆర్‌డీఏలో 15 సెక్షన్‌లు ఉండేవి.

● గుంటూరు సర్కిల్‌లో....

గుంటూరు సర్కిల్ పరిధిలో గుంటూరు టౌన్-1, తెనాలి డివిజన్‌లుండగా గుంటూరు టౌన్-1, 2, 3, 4 కాగా తెనాలి టౌన్, తెనాలి రూరల్, పొన్నూరుతో మొత్తం 7 సబ్ డివిజన్‌లున్నాయి. రెండు డివిజన్‌లలో కలిపి మొత్తం 25 సెక్షన్‌లను ఏర్పాటు చేశారు. కాగా గతంలో 8 సబ్ డివిజన్‌లలో ఒకటి కుదించగా గతంలో 29 సెక్షన్‌లున్నాయి.

● పల్నాడు సర్కిల్‌లో.....

పల్నాడు సర్కిల్‌లో గతంలో నరసరావుపేట, మాచర్ల డివిజన్‌లుండగా కొత్తగా చిలకలూరిపేట డివిజన్‌తో మొత్తం మూడు డివిజన్‌లను ఏర్పాటు చేశారు. మాచర్ల డివిజన్‌లో దాచేపల్లి, గురజాల, మాచర్ల, పిడుగురాళ్ళ సబ్ డివిజన్‌లు కాగా, నరసరావుపేట డివిజన్‌లో నరసరావుపేట టౌన్, నరసరావుపేట రూరల్, వినుకొండ సబ్ డివిజన్‌లుండగా, చిలకలూరిపేట డివిజన్‌లో చిలకలూరిపేట, సత్తెనపల్లి టౌన్, సత్తెనపల్లి రూరల్ సబ్ డివిజన్‌లతో మొత్తం పది సబ్ డివిజన్‌లు, 38 సెక్షన్‌లతో పల్నాడు సర్కిల్ విభజించారు.

● బాపట్ల సర్కిల్‌లో

బాపట్ల సర్కిల్‌లో బాపట్ల, చీరాల, అద్దంకి డివిజన్‌లు యథాతదంగా ఉన్నాయి. గతంలో ఇక్కడ 8 సబ్ డివిజన్‌లుండగా కొత్తగా మరో సబ్ డివిజన్‌తో మొత్తం 9 సబ్ డివిజన్‌లు, 31 సెక్షన్‌లతో ఏర్పాటు చేశారు. అద్దంకి డివిజన్‌లో అద్దంకి, మార్టూరు సబ్ డివిజన్‌లు కాగా, బాపట్ల డివిజన్‌లో బాపట్ల, చెరుకుపల్లి, చుండూరు, రేపల్లె సబ్ డివిజన్‌లు, చీరాల డివిజన్‌లో చీరాల, పర్చూరు, వేటపాలెం సబ్ డివిజన్‌లున్నాయి. ఇక్కడ గతంలో 28 సెక్షన్ కార్యాలయాలుండగా కొత్తగా 31 సెక్షన్‌లు ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ బలోపేతానికి వ్యూహాలు

గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై దృష్టి

పల్నాడు జిల్లా సమావేశంలో ఏపీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి

నరసరావుపేట టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి వ్యూహాలు రచిస్తున్నట్లు ఏపీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి తెలిపారు. నరసరావుపేటలోని భువనచంద్ర టౌన్ హాల్‌లో గురువారం పల్నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆమె ప్రసంగించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపడటం రాజకీయంగా చాలా అవసరమని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టామన్నారు. పార్టీ బలోపేతానికి సంబంధించి జిల్లా స్థాయి విస్తృతస్థాయి సమావేశాల్లో నేతల ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. బీజేపీతో సంబంధాల కోసం టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టాయని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో స్వార్థ రాజకీయాలు నడుస్తున్నాయన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా పరిశీలకుడు మదన మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ కిసాన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకర్, అధికార ప్రతినిధి నాగరాజు, పల్నాడు డీసీసీ అధ్యక్షుడు గర్నెపూడి అలెగ్జాండర్ సుధాకర్‌తో పాటు నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు కమలాకర్, వై.రామచంద్రారెడ్డి, టి.యలమందారెడ్డి, బి.రామాంజనేయులు, పి.నాగేశ్వరరావు, సీహెచ్ చంద్రపాల్, ఎం.రాధాకృష్ణ, ఎష్ఎం బాష పాల్గొన్నారు.



చంద్రబాబుతో పాటు ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి పెమసాని ఎమ్మెల్యేలు రామాంజనేయులు ,నసీర్



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యేలు, తెలుగుదేశం నాయకులు, విద్యార్థులు



ప్రజా చైతన్యంతోనే.. డ్రగ్స్ కట్టడి



ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న చంద్రబాబు, డీజీపీ హరీష్‌కుమార్‌గుపా

(5వ పేజీ తరువాయి)

వెళ్లాలన్నారు. గంజాయి, డ్రగ్స్‌ను నియంత్రించకపోతే జాతి నిర్వీర్యమవుతుందన్నారు. జీరో డ్రగ్స్‌కు ప్రతి ఒక్కరు సహకరిస్తే రాష్ట్రంలో 100 శాతం శాంతిభద్రతలను కాపాడే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ 2047 నాటికి రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా సుసంపన్నంగా ఉండాలన్నదే లక్ష్య ంగా చంద్రబాబు విజన్‌తో పనిచేస్తున్నారన్నారు. ఈగల్ ద్వారా ఈ ఏడాదిలో తీసుకున్న చర్యలను ఐజీ రవికృష్ణ వివరించారు.

విద్యార్థులతో భారీ ప్రదర్శన

తొలుత స్థానిక అమరావతిరోడ్డులోని జ్వరాల ఆస్పత్రి నుంచి చిల్లీస్ రెస్టారెంట్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో విద్యార్థులు హోరెత్తించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహా అధికారులు, ప్రజాప్రతినిధులు విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం చంద్రబాబు చిల్లీస్ సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం శ్రీకన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను చంద్రబాబు తిలకించారు. అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమాల్లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయులు, సంధ్యారాణి, మేయర్ కోవెలమూడి నాని, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, తెనాలి శ్రావణ్‌కుమార్, గళ్లా మాధవి, నసీర్‌అహ్మద్, భాష్యం ప్రవీణ్, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా, కలెక్టర్ నాగలక్ష్మి, కార్పొరేషన్ల చైర్మన్లు డేగల ప్రభాకర్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, హసన్‌బాషా, రాయపాటి శైలజ, నాయకులు నన్నపనేని రాజకుమారి, ముత్తినేని రాజేష్, చిట్టాబత్తిన చిట్టిబాబు, శివనాగమల్లేశ్వరరావు(మల్లి), వేములకొండ శ్రీనివాసరావు, రావిపాటి సాయికృష్ణ, మన్నవ వంశీ, షేక్ సజీల, కొమ్మినేని సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



గజమాలతో చంద్రబాబుకు స్వాగతం

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

నరసరావుపేట లీగల్, జూన్ 26, (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు అవ్వడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా గురువారం విధించారు. బాపట్లకు చెందిన కంభంపాటి వెంకటరామగోపాలశర్మ 2015 మార్చి 5న ముప్పాళ్ళ మండలం గోళ్లపాడుకు చెందిన గోపు కోటేశ్వరరావు వద్ద రూ.2లక్షలు అప్పుగా తీసుకున్నాడు. 2018 అక్టోబరు 12న రెండు లక్షలకు చెక్కు ఇచ్చాడు. కోటేశ్వరరావు చెక్కును తన బ్యాంక్ ఖాతాలో వేయగా అది చెల్లలేదు. ఈ మేరకు ఆయన కోర్టులో కేసు దాఖలు చేసుకున్నాడు. విచారణలో నేరం రుజువు అవ్వడంతో వెంకటరామగోపాలశర్మకు ఏడాది జైలు, రెండు లక్షల రూపాయలు ఫిర్యాదుకు చెల్లించేలా, రూ.5000 జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయ అధికారి ఏ సలోమి తీర్పు వెలువరించారు.

ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

వినుకొండ టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఫర్టిలైజర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం స్థానిక ఫర్టిలైజర్స్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని నూతనంగా ఎంపికైన అధ్యక్షుడు కొండపల్లి బ్రహ్మయ్య, గౌరవాధ్యక్షుడు కట్టమూరి శ్రీనివాసరావు, సెక్రటరీ మాదాల శివకోటేశ్వరరావు, ట్రెజరర్ బింగి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు పసుపులేటి ఏడుకొండలు, జాయింట్ సెక్రటరీ సుగ్రీవ మల్లికార్జునరావు, కార్యవర్గసభ్యులను అభినందించారు. నూతన కార్యవర్గం రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తూ వారికి మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

జీవీ పరామర్శ

వినుకొండ టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 21వ వార్డు రణా హుస్సేన్ బజారులో నివస్తున్న గోల్డ్ కరిముల్లా తండ్రి షేక్ హుస్సేన్‌బాషా, షేక్ మౌలాలిలను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా జీవీ వారి కుటుంబసభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య సమాచారాలను అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈపూరులో సీపీఐ మహాసభలు

ఈపూరు, జూన్ 26, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఈపూరులో సీపీఐ పార్టీ ఐదో మహాసభలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీపీఐ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతీ వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కోరుట్ల రామారావు, ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘం కార్యదర్శి వి.రాము, మల్లికార్జునరావు, పి. వెంకటేశ్వర్లు, వందనం తదితరులు పాల్గొన్నారు.

తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలి: ఏపీడీ

బొల్లాపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరుపాడు, గుట్లపల్లి, గంగుపల్లి, గుమ్మనంపాడు తదితర గ్రామాల్లో వెలుగు పల్నాడు జిల్లా అసిస్టెంట్ పీడీ సీహెచ్ రాజ్‌ప్రతాప్ గురువారం ఆయా గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించినట్లయితే మరి కొంతమంది డ్వాక్రా మహిళలకు రుణ సౌకర్యం కల్పించటానికి అవకాశం ఉంటుందని, అలాగే ప్రతి ఒక్కరూ కేవైసీ చేయించుకోవాలని, అలాగే గ్రూపుల్లో మహిళలకు, కుటుంబాల్లో ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలు విద్యార్థులకు విద్యా రుణాల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్క మహిళ బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ఎస్‌హెచ్ శ్రీనివాసరావు, ఏపీఎం వాసుబాబు, సీసీలు సైదులు, ఎర్ర కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్

వినుకొండ టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ, రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల ప్రకారం జూలై 7వ తేదీన కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంక్ కేసులు, మనోవర్తి కేసులు, కుటుంబ వివాద కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, ముందస్తు రాజీ చేసుకోదలచిన కేసులను ఇరుపక్షాల మధ్య సామరస్య పూర్వకంగా రాజీచేసి పరిష్కరించడం జరుగుతుందన్నారు. వినుకొండ న్యాయస్థాన పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ వివాదాలను శాంతియుతంగా రాజీ చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు సూచించారు.

తల్లికి వందనం పోటీల్లో కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

బొల్లాపల్లి, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం కార్యక్రమంలో భాగంగా గురువారం బొల్లాపల్లి జడ్పీ పాఠశాలలో జరిగిన మండల స్థాయిలో విద్యార్థులకు పలు పోటీల్లో కేజీబీవీ విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారు. వివిధ పాఠశాలల విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో కేజీబీవీకి చెందిన ఇంటర్ విద్యార్థిని కావ్యబాయి ప్రథమస్థానంలో నిలవగా వ్యాసరచన పోటీల్లో కేజీబీవీకి చెందిన 10వ తరగతి విద్యార్థిని అనూషాబాయి, 9వ తరగతికి చెందిన స్వాతిబాయిలు ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే డ్రాయింగ్‌లోనూ అంజలి బాయి, ఐశ్వర్యబాయిలు ప్రతిభ చూపారు. పాటల పోటీల్లో ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు హర్షిత, సరస్వతిలు ప్రతిభ కనబరిచారు. కార్యక్రమంలో ఎంఈవో కే పార్వతి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమేష్‌లు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రం... సీఎం చంద్రబాబు లక్ష్యం

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



మాదక ద్రవ్యాల వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, తదితరులు

వినుకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యం అని, అందుకోసమే ఈగల్ టీమ్‌ను స్థాపించారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. యాంటీ డ్రగ్స్‌డే సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రైవేటు, ప్రభుత్వ విద్యార్థులతో కలిసి తహసీల్దార్, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, ఐసీడీఎస్, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో విద్యార్థులతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గంజాయి వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు. ఇప్పటికే లక్ష ఎకరాల మేర గంజాయి పంటను సాగు చేయకుండా నిరోధించగలిగామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్ర బోస్, సీఐ శోభన్ బాబుతో పాటు వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు, వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ పిలుపునిచ్చారు. గురువారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ ఒకసారి మాదక ద్రవ్యాలకు బానిసైతే జీవితమే చీకట్లోకి వెళ్ళిపోతుందన్నారు. సమావేశంలో తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ రఫీ, తిరుమలకొండ నరసింహారావు, దండా అనీల్ తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో తహసీల్దార్ బండి నిర్మల, ఎంపీడీవో కే మాధ్యూబాబు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యార్థులు, గ్రామస్థులు ర్యాలీలో పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి చెరువు కట్ట సెంటర్ వరకు, అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ జరిగింది.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని చిలకలూరిపేట అర్బన్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ నుంచి ఎన్ఆర్‌టీ సెంటర్ వరకు కొనసాగిన ర్యాలీలో సీఐ పి.రమేష్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బందితో పాటు యువత, మహిళలు పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టి అనేక చర్యలు తీసుకుందన్నారు. ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు, సీఐ పి.రమేష్, టీడీపీ నాయకులు షేక్ కరీముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, కౌన్సిలర్ లు గోల్డ్ శ్రీను, జాలాది సుబ్బారావు, బేరింగ్ మౌలాలి పాల్గొన్నారు. కాగా మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సుగాలీ కాలనీ స్కూలులో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

● ఈపూరు: మండల కేంద్రం ఈపూరులో గురువారం ప్రపంచ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. మానవహారం, వాకథన్ నిర్వహించారు. కార్యక్రమంలో ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ నుంచి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు, సిబ్బంది, గ్రామ పెద్దలు, విద్యార్థులు, యువత, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయం నుంచి సెంటర్ వరకు అధికారులు మాదకద్రవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ గురువారం ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అర్జున్‌నాయక్, ఈవోపీఆర్డీ సుగుణ, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నాసరయ్య, ఇన్‌చార్జి ఆర్ఐ చంద్రబాబు, పంచాయతీ కార్యదర్శులు బాలపరమేశ్వరరావు, మహేంద్ర పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బొల్లాపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో పీ సీతారామయ్య ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం నుంచి బొల్లాపల్లి ఎన్‌టీఆర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. బొల్లాపల్లి కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏ సుధాకర్, వివిధ శాఖల అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో స్వరూపరాణిలు కోరారు. మండల కేంద్ర మైన నాదెండ్లలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నిర్మల లక్ష్మీకుమారి, వైద్యాధికారులు జ్ఞానేశ్వరి, ప్రసాదునాయక్, ఎంఈవో కృష్ణారెడ్డి, ఏపీఎం రమేష్‌బాబు, కార్యదర్శి సుబ్బారావు, సీసీలు హేమలత, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో జరిగిన మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పుల్లారావు, పోలీసులు, అధికారులు

వసతులున్నా నివాసం ఎందుకు ఉండటం లేదు?

● టిడ్కో గృహాలపై సమీక్షలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో 52 ఎకరాలలో నిర్మించిన టిడ్కో గృహాల కాలనీలో అన్ని మౌలిక వసతులు కల్పించినా ఎక్కువ మంది ఎందుకు నివాసం ఉండడం లేదని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం అధికారులను ప్రశ్నించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో సంబంధిత అధికారులతో టిడ్కో గృహాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం 4,512 ఇళ్లు నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పించినా, ఇప్పటికీ 3,300 గృహాలు ఖాళీగా ఉండడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలు వెచ్చించి నిర్మించిన ఇళ్లలో ఉండటానికి గతంలో రిజిస్ట్రేషన్లు చేయించుకున్నవారంతా ఎందుకు నివాసం ఉండటంలేదో వారినే అడిగి తెలుసుకోవాలని అధికారులను కోరారు. లబ్ధిదారులు నివాసానికి విముఖంగా ఉంటే ఆ ఇళ్లను ఇతరులకు కేటాయించాలని ప్రత్తిపాటి అధికారులతో అన్నారు. ఇళ్లలో నివాసం ఉండకపోతే, అవి పాడైపోవడంతో పాటు ప్రభుత్వ సంకల్పం నెరవేరదని చెప్పారు. ఇళ్లు నిరుపయోగంగా ఉండటమనేది కేవలం చిలకలూరిపేటకే పరిమితం కాదని, రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్య ఉందని ఆయన చెప్పారు. టిడ్కో గృహాల సద్వినియోగంపై ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రులతో చర్చిస్తానని ఆయన తెలిపారు. సమావేశంలో టిడ్కో ఎస్ఈ ఉమాశంకరశాస్త్రి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు, అర్బన్ సీఐ రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

మెప్మా సిబ్బందికి ట్యాబ్‌ల పంపిణీ

మెప్మా ఆర్పీలు సమర్థవంతంగా పనిచేసి కూటమి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం కోరారు. మునిసిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మెప్మా సిబ్బందికి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన గత ప్రభుత్వం, ఈ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన అవినీతి మంత్రి మెప్మా సిబ్బందిని, డ్వాక్రా మహిళల్ని కూడా దోచుకున్నారని విమర్శించారు. విధుల్లో కొనసాగడానికి కాలపరిమితి ఉన్నా కూడా కావాలని మంత్రి గ్రూపు సభ్యుల్ని భయపెట్టి, వారినుంచి అన్యాయంగా రూ.1,000 నుంచి రూ.6,000వరకు వసూలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెన్యూవల్స్ ముసుగులో మెప్మా సిబ్బందిని, డ్వాక్రా మహిళ నుంచి అందినకాడికి అడ్డగోలుగా దోచేసిన చరిత్ర గతపాలకులకే దక్కిందన్నారు.

వైద్యం వికటించి బాలిక మృతి

యడ్లపాడు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు మండలంలో వైద్యం వికటించి ఓ బాలిక మృతి చెందింది. జగ్గాపురం గ్రామానికి చెందిన బొంతా కోటేశ్వరరావు, అక్క దంపతులకు నలుగురు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తె శాలినికి మంగళవారం జ్వరంతోపాటు నీరసంగా ఉండడంతో యడ్లపాడులోని ఓ మెడికల్ స్టోర్ వద్దకు తీసుకువచ్చారు. ఆ షాపు యజమాని సురేష్ ఆర్‌ఎంపీగా వైద్యం చేస్తుంటాడు. అతను పాపకు సెలైన్ ఎక్కించడంతోపాటు, ఇంజక్షన్‌లు చేసి కొద్దిసేపటి తరువాత ఇంటికి పంపించాడు. అయితే ఇంటికి వెళ్ళినప్పటి నుంచి బాలిక అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు తిరిగి సురేష్‌ను సంప్రదించగా ఆయన స్పందించలేదు. దీంతో స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్ళగా బాలికను పరీక్షించి గుంటూరుకు తీసుకెళ్లాలని సూచించారు. బంధువులు బాలికను గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సపొందుతూ బాలిక గురువారం ఉదయం మృతిచెందింది. దీంతో బాలిక బంధువులు మెడికల్ షాపు ఎదుట మృతదేహంతో గురువారం సాయంత్రం ఆందోళనకు దిగారు. బాలిక కుటుంబానికి న్యాయం చేయాలని సుమారు నాలుగు గంటలకు పైగా షాపు ఎదుట ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి, స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భరద్వాజలు పాప మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్ఐ శివరామకృష్ణ సైతం ఆందోళన జరుగుతున్న షాపు వద్దకు చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. స్థానిక పెద్దలు, కుల పెద్దలు జోక్యం చేసుకుని బాలిక కుటుంబానికి పరిహారంగా ఇప్పించేలా ఒప్పించి ఆందోళనను విరమింప చేసినట్లు సమాచారం.

వ్యాధి నిర్ధారణ చేయకుండా వైద్యం

● డాక్టర్ భరద్వాజ్, పీహెచ్‌సీ వైద్యాధికారి

శాలిని అనారోగ్యం ఏమిటో పరీక్షించి నిర్ధారణ చేయకుండా ఆర్‌ఎంపీ వైద్యం చేశాడని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భరద్వాజ్ వివరించారు. జీజీహెచ్‌కు తీసుకెళ్ళిన తరువాత అక్కడి వైద్యులు పాపకు పరీక్షలు నిర్వహించి బ్రెయిన్ ఇన్ ఫెక్షన్ వచ్చినట్లు నిర్ధారించి వైద్యం అందించారన్నారు. అదే విషయం డిశ్చార్జి లెటరులో రాశారని, కేస్ షీటు క్షుణ్ణంగా పరిశీలిస్తే అసలు విషయం తెలుస్తుందన్నారు. ఆర్‌ఎంపీ ప్రథమ చికిత్స మాత్రమే అందించాలి తప్ప ఎలాంటి వైద్యం అందించ కూడదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

బీఎస్పీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగవంశీ

వినుకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణంలోని క్రిస్టియన్‌పాలెంకు చెందిన కంభంపాటి నాగవంశీ ఎన్నికయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేసినట్లు నాగవంశీ తెలిపారు. నాగవంశీ 2018లో బహుజన సమాజ్ పార్టీ సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరి అంచెలంచెలుగా ఎదిగి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షునిగా ఎన్నికైన కంభంపాటి నాగవంశీని పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

నట్టల నివారణ మందు పంపిణీ



నట్టల నివారణ మందులను అందజేస్తున్న ఏరియా పశువైద్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరాములు

వినుకొండ టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల ఆరోగ్య సంరక్షణకు నట్టల నివారణ మందు వేయించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీరాములు కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ఉచిత నట్టల నివారణ మొదటి రోజు కార్యక్రమంలో భాగంగా వినుకొండ మండల నాగిరెడ్డిపల్లి గ్రామంలో నట్టల నివారణ మందులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీరాములు మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందించే నట్టల నివారణ మందులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, జీవాల్లో ఆరోగ్య పరిస్థితిని మెరుగుపరచుకోవాలని రైతులను కోరారు. ప్రాంతీయ పశువైద్యశాల వినుకొండ తరపున మొత్తం 60వేల జీవాలకు నట్టల నివారణ మందులను ఈ నెల 26వ తేదీ నుంచి జూలై 10వ తేదీ వరకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి అమీర్‌బాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

930 జీవాలకు మందు పంపిణీ

శావల్యాపురం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జీవాలకు సకాలంలో నట్టల నివారణ మందు వేయడం వల్ల జీర్ణాశయ సమస్యలు తొలగిపోయి ఆరోగ్యంగా ఉంటాయని వేల్పూరు సెక్టార్ పశువైద్యాధికారి పాలపర్తి గణేష్‌కుమార్ అన్నారు. మండలంలోని వేల్పూరు, కారుమంచి, శావల్యాపురం సెక్టార్ల పరిధిలో 930జీవాలకు గురువారం నట్టల నివారణ మందును వేశారు. పశువైద్యాధికారి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో వేల్పూరులో 552జీవాలకు, కారుమంచిలో 251జీవాలకు నట్టల నివారణ మందు వేయగా, పశువైద్యాధికారి జర్ని కావ్య ఆధ్వర్యంలో శావల్యాపురంలో 127జీవాలకు నట్టలనివారణ మందు వేశారు. కార్యక్రమంలో వెటర్నీ అసిస్టెంట్ సుందరయ్య, ఆఫీస్ అటెండర్‌లు బుల్లెయ్య, పున్నయ్య పాల్గొన్నారు.

ఈపూరు మండలంలో...

ఈపూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ముప్పాళ్ళ గ్రామంలో పల్నాడు జిల్లా పశువైద్య ఉప సంచారకులు డాక్టర్ పి.రామారావు ఆధ్వర్యంలో గురువారం మూగ జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ముందుగా కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకులు రాపర్ల జగ్గారావు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని సుమారు 1900 గొర్రెలకు, 100 మేకలకు, నట్టల నివారణా మందులు వేశారు. కార్యక్రమంలో విడలపాటి హనుమయ్య, జీష్టి బుజ్జయ్య, ఫులుకూరి శ్రీనివాసరావు, ఆపూరు సహాయక సంచారకులు పి. శ్రీనివాసమూర్తి, ముప్పాళ్ళ పశు వైద్య అధికారిణీ డాక్టర్ ఎం.సునీత, వైద్య సిబ్బంది వెంకటరావు, సాంబశివరావు, అరవింద్, సిద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారిని కలిసిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): డీఎఫ్‌వో కార్యాలయంలో పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి జీ కృష్ణప్రియను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కలిశారు. ఈ సందర్భంగా కోటప్పకొండ దేవస్థానం ఘాట్‌రోడ్, గిరి ప్రదక్షణ చేసే బీటీ రోడ్ అనుమతుల గురించి చర్చించారు. కోటప్పకొండను మరింత సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు.

బరంపేట బ్రిడ్జి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

నరసరావుపేట టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని బరంపేట బ్రిడ్జి నిర్మాణం పనులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురవారం కొబ్బరియాల కొట్టి ప్రారంభించారు. అనంతరం నిర్మాణం పనులను పరరిశీలించారు. తరువాత పార్క్‌లో తాగునీటి సరఫరా, పరిశుభ్రత పనులు పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు., టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో స్వచ్ఛాంధ్ర

నరసరావుపేట టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులో ఉన్న డాక్టర్ కోడెల శివప్రసాదరావు స్టేడియంలో గురువారం 3వ రోజు స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డీఎస్పీ కే నాగేశ్వరరావు, సీఐ చరణ్ తదితరులు పాల్గొని చీపురుపట్టి చెత్తను ఊడ్చారు. స్టేడియంలోని గడ్డి, పిచ్చి మొక్కలు తొలగించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, మున్సిపల్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్

వినుకొండ, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణంలో మేజర్ డ్రెయిన్లలో పూడికతీత కార్యక్రమం చేపట్టినట్లు వినుకొండ మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. పట్టణంలోని మెయిన్ బజారు, నరసరావుపేట రోడ్డు, మార్కాపురం రోడ్, ఇనుకవాగు మెయిన్ డ్రెయిన్లల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో ఎటువంటి వరదలు సంభవించకుండా, రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బీపీఎస్ 2019, ఎల్ఆర్ఎస్ 202 నియమాలకు లోబడి రాష్ట్ర ప్రభుత్వం పట్టణానికి కేటాయించిన రూ.44.59లక్షల నిధులతో పలు విడతలుగా కాలువ పూడికతీత పనులను చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఆదినారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, సిబ్బంది పాల్గొన్నారు.



గురుపౌర్ణమి మాసోత్సవాల్లో భాగంగా 1100 మామిడికాయలతో స్వామివారికి ప్రత్యేకఅలంకరణ, దేవస్థానంలో మహిళలు రంగులతో వేసిన సాయిబాబా చిత్రం

గురుపౌర్ణమి మాసోత్సవ ప్రత్యేక పూజలు

వినుకొండ టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమి సందర్భంగా బోసుబొమ్మ సెంటర్‌లోని షిరిడిసాయిబాబా దేవస్థానంలో రంగురంగులతో భారీ సాయిబాబా చిత్రాన్ని ఏర్పాటుచేసి సుమారు 1100 మామిడి కాయలతో స్వామివారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న గ్రామ పెద్దలు

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

బొందిలిపాలెం (శావల్యాపురం) జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు అడవిపేరంటాలమ్మ సేవాసమితి ద్వారా పూర్వ విద్యార్థులు అందిస్తున్న సహకారం అభినందనీయమని మాజీ వీఆర్వో చల్లగుండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని బొందిలిపాలెంకు చెందిన అడవి పేరంటాలమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో గ్రామంలోని మెయిన్, బీసీకాలనీ ప్రాథమిక పాఠశాలల్లోని 43మంది విద్యార్థులకు ఏడాదికి సరిపడా నోటుపుస్తకాలు, డైరీలు, పెన్నులు, పెన్సిళ్ళు, జామెంట్రీలు తదితర విద్యాసామాగ్రిని గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాసమితి నిర్వాహకుడు రసపుత్ర రాంబాలాజీసింగ్, ఇన్‌చార్జి సర్పంచ్ చింతా విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ ఎం.వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు పి.బసవయ్య, డి.వెంకటేశ్వర్లు, బి.వెంకటేశ్వర్లు, పి.నారయ్య, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

ఈపూరు, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపాలెం మండల పరిషత్ పాఠశాల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ఇటీవల బదిలీపై నరసరావుపేట వెళుతున్న సుజాత పాఠశాలల్లోని విద్యార్థినీ విద్యార్థులకు గురువారం ప్లేట్లు పంపిణీచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కూరాకుల శ్రీనివాసరావు, తాతాంబరీ, విద్యాకమిటీ చైర్మన్ అంకారావు, వైస్‌చైర్మన్ వెంకటేశ్వరి, గ్రామ పెద్దలు కూరాకుల హనుమంతరావు, అంగన్‌వాడీ కార్యకర్త సూర్యకాంతం, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయం: హెచ్‌ఎం

పోట్లూరు (శావల్యాపురం) జూన్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు దాతలు స్వచ్ఛందంగా తమవంతు సహకారం అందించడం అభినందనీయమని హెచ్‌ఎం సింగంశెట్టి అన్నపూర్ణమ్మ అన్నారు. మండలంలోని పోట్లూరు జడ్పీ పాఠశాల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా రూ.10వేలు విలువజేసే 100 స్టీలుప్లేట్లను పాఠశాల పూర్వవిద్యార్థులు చింతా శ్రీనివాసరావు, గాలి ఏడుకొండలు వారి కుటుంబసభ్యుల చేతులమీదుగా గురువారం అందజేశారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి, మౌలికవసతుల కల్పనకు దాతలు, పూర్వవిద్యార్థులు, గ్రామ పెద్దలు ఎంతగానో సహకరిస్తున్నారన్నారు. విద్యార్థులు దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకొని పరీక్షలలో ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. పూర్వవిద్యార్థులు చింతా శ్రీనివాసరావు, గాలి ఏడుకొండలు కుటుంబ సభ్యులను ఎస్‌ఎంసీ చైర్మన్ చింతా సైదారామారావు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.